కథానిక

# పర్యవసానం

గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

"డాక్టరుగారూ!"

"ఎవరు?"

"డాక్టరుగారులేరూ?" నా భుజానపడుకున్న రామం నిస్త్రాణగా మూలిగాడు. నా చెయ్యిపట్టుకుని అమ్మ చెవులకిచుట్టిన వూలుగుడ్డని సవరించుకుంటూసీత నీరసంగా నిలుచుంది.

"లేరు" అని నిర్లక్ష్యంగా ఆ అబ్బాయి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

"బాబు, బాబూ! కాస్త నా మాటవినిపో. డాక్టరుగారు మళ్ళీ ఎప్పుడు వస్తారు?" అని నేను అతడిని తరుముకుపోతున్నట్లు అడిగాను. కాని అతను పలకకుండానే అంతర్థానమైనాడు.

సీత చలికి గజగజలాడుతున్నది. రామం స్పృహతప్పి వాడిపోయినతమలపాకులా భుజాన మూలుగుతూపడిఉన్నాడు.

ఇంతలోకే గదిని చిమ్మటానికి వచ్చిన పనిమనిషి "డాక్టరుగోరు నిద్దరోతున్నారు" అన్నది. ఇంకా నిద్రేమిటి ఎనిమిదిగంటలవుతుంటే అని పించిందినాకు. రోగులుబాధపడుతూ గుమ్మంలో ఆపసోపాలుపడుతూకూర్చుంటే డాక్టర్లు నిద్ర పోకూడదు. ఔను. నిజమేగానీ, అది ఆయన ఇష్టం. ఒక హోదా, ఒకపేరూ వచ్చినతర్వాత మనిషి ఏ ఆట ఆడినా చెల్లుతుంది.

"అమ్మా, బిడ్డ మూసినకన్ను ఎరగకుండా పడి ఉన్నాడు. డాక్టరుగారిని లేపి రమ్మని చెబుదూ."

"అమ్మబాబోయ్, నిద్రలేపడమే! డొక్క చీల్చేస్తారు." అని చిమ్మటం ముగించుకుని, పనిమనిషి లోపలికి వెళ్ళిపోయింది.

మీనమేషాలు లెక్కపెడుతూ, బెంచీమీద కూర్చున్నాను. గాలికి బల్లమీది క్యాలెండరు కాగితాలు ఎగురుతున్నాయి. అవతల డాక్టరుగారి సంచీ, స్టెతస్కోపూ, మందులప్రాపగాండా కాగితాలకట్ట, వాటిమీద ఒక పెద్ద గవ్వ.

గోడగడియారం ఎనిమిదోగంట కొట్టింది. రామం ఉచ్ఛ్వాసనిశ్వాసల ఉష్ణం నా హృదయాన్ని దహిస్తున్నది. సీత కూచోలేక బెంచీమీద నడుంవాల్చి, కన్నుమూసింది.

ఇంతలోకే ఒక మెడికల్ రెప్రజెంటేటివ్ వేంచేసి, డాక్టరుగారి రివాల్వింగ్ చెయర్ దగ్గర ఉన్న కుర్చీలోకూచుని, నెక్ టై సర్దుకుని, టోపీ బల్లమీద పెట్టి నలుదిసెలా తేరిపార చూస్తున్నాడు.

ఎనిమిదింబావు. డాక్టరుగారు ఇంకా రాలేదు. లోపల ఆయన ఎవరిమీదో విరుచుకుపడుతున్నట్టు ఆయన సింహగర్జనలుమాత్రం వినబడుతున్నాయి.

నలభైఏళ్ళ నడివయస్సుమనిషి, స్థూలకాయం, చామనచాయ శరీరం, సిల్కు లాల్చీ, గ్లాస్కో మల్లుపంచా, న్యూవమాంటు కళ్ళజోడూ, సెంటు వాసనలు గుప్పుమంటున్నాయి. ఆయన వచ్చీ రావటంతోనే బల్లకుఉన్న బెల్లు స్విచ్ నొక్కాడు. డాక్టరుగారి అబ్బాయి వచ్చి ఆ వ్యక్తిని లోపలికి తీసికెళ్ళాడు.

పదినిమిషాల్లో డాక్టరు బయటికివచ్చాడు. ఆయనను చూసి ఏజంటు లేచి నిలుచుని, "గుడ్ మార్నింగ్ డాక్టర్!" అని చిరునవ్వుతో అంటూ చేతిసంచీ తెరిచాడు.

నేను ఆదుర్దాగా లేచి, "డాక్టర్ గారు, అబ్బాయికి స్మృతిలేదు. ఎట్లా రక్షిస్తారో మీదే భారం" అన్నాను.

"ఏమీ ఫరవాలేదు. సీతారామయ్య చౌదరిగారి పినతల్లికి సుస్తీగా ఉందిట. చూసి ఇదుగో ఇక్కడున్నట్లు వచ్చేస్తాను" అని చెబుతూనే ఆయన కారుదగ్గరికి నడిచాడు.

"నర్విటోన్, లివోటోన్, కార్డియటోన్, థైరోటోన్..." అంటూ ఏజంటు ఆయన వెనకాల పరుగెత్తాడు.

"చాల్లేవయ్యా, అంభంలోకుంభం ఆదివారంలో సోమవారం అన్నట్లుంది" అని డాక్టరు కారెక్కాడు.

"వెరీగుడ్ కమీషన్ డాక్టర్" అంటూ

వెళ్తున్న కారు వెనక దుమ్ములో నిలబడ్డ అతణ్ణి చూస్తే, పాపం అతని సూటూబూటూ హాంగా మాకు కూడా తగినమర్యాద లభించలేదే అని పించింది.

నిన్న సాయంత్రం ఫోన్ చేసినా, డాక్టరుగారు ఇంటికిరాలేదు. సినిమాకు వెళ్లారని కంపౌండరు చెప్పాడు. సినిమానుంచి వచ్చినతర్వాతరమ్మంటే అప్పుడు శ్రీవారు బేజారైవస్తారు ఎక్కడికీ విజిట్లకురారు అన్నాడు. అదీకాక, పోయినసెల బిల్లు ఇంకా చెల్లించలేదు. అదీ కొంచెం గుర్రుగానేఉండి ఉంటుంది.

రామం మూలుగుశబ్దం చాలీచాలని గొర్రె తోక జీతాల గుమాస్తాయొక్క చెలించీ ఫలితంలేని హృదయంలో గుచ్చుకున్న వేలకువేల ములుకోల్లలో ఒకటి అయితే నేనేం చెయ్యను? రామం మూలుగువింటూ, సీత దైన్యంకంటూ కూచో వలసిందే. అంతకంటె చెయ్యగలిగిం దేమీలేదు. డబ్బు లేనివాడిని డుబ్బుకు కొరగానివాడిని.

ఈ డాక్టరు తాత్సారంచేస్తే మరొక డాక్టరు దగ్గరికిపోలేను. పోగలిగే త్రాణఉంటే ఈయనే సరిగా చూసేవాడు. డబ్బుకు మనిషి లొంగి పోతాడు. డబ్బుంటే కొండమీది కోతి దిగి వస్తుంది. అయితే ఒకటి. చావు బ్రతుకులతో చెలగాటం వైద్యం. మానవ మానసాలకు సన్నిహితమైన వృత్తి ఇది. బీదవాడిదీ ప్రాణమే. పేదవాడిదీ బాధే. చావు బ్రతుకులమధ్య తారట్లాడుతున్న బీదవారి పసికూనను కాదని, కాస్త సుస్తీగాఉన్న గొప్పయింటి ముసలిగువ్వను చూడబోవటం సమంజసమే గాబోలు!

"అయ్యా డాక్టరుగారు లేరూ?"

పరధ్యానంగాఉన్న నన్ను కిర్రుచెప్పుల శబ్దం ఆకర్షించింది. ఆ తలపాగా ఆసామి "అయ్యా డాక్టరుగారు లేరూ?" అని మళ్ళీ అడిగాడు.

"లేరు. ఎక్కడికో వెళ్ళారు——"

ఆ ఆసామీ అవతలి బెంచీమీద కూర్చుని చుట్టముట్టించాడు. చుట్ట కాల్చుకుంటూ పరామర్శించాడు. "పంతులూ బిడ్డకేమిటీ?జ్వరమా?"

"ఔ"నన్నట్లు తల ఊపాను.

"చీటికీమాటికీ డాక్టరుకోసం పరుగెత్తకూడదు పంతులూ. చంటిపిల్లలకు జలుబూ పడిశంపడుతూ ఉంటాయి. కస్తూరిమాత్ర వెయ్యటమో, గోరోజనం చాదిపొయ్యటమో——అట్లా చిటకాలు చేసుకోవాలిగాని, ఈ ఆస్పత్రి నీళ్ళకు డబ్బు ధారపొయ్యటం దారుణం" అని ఆరిపోయిన చుట్టను వెలిగించుకోటానికి అగ్గిపుల్ల గీచాడు.

"ఏంచేస్తాం నాయినా, ప్రతిసారీ ముంచుకు పోయేటట్లు జబ్బులు చేస్తుండే" అని నేను అన్నాను.

"మీరిట్లా అంటారుగానీ మా ఊరి మునసబు వీరయ్యగారు "మానేదానికి మందేలా, మానని దానికి మందేలా" అని ఒళ్ళు జ్వరంతో మలమల మాడుతున్నా సరే స్నానం, సంధ్యా, అనుష్టానం, సుష్టుగా భోజనంచేసి తీరాల్సిందే...ఆయనకిప్పుడు డబ్బైరెండేళ్ళు" అతను ఉమ్మివేసుకోటానికి వాకిట్లోకి వెళ్ళి మళ్ళీవచ్చాడు.

"పంతులూ, మరోసంగతి. ఈ ఇంగ్లీషు డాక్టర్ల తరహాయేవేరు. నాలుగురోజులుదాకా, ఆ మందూ ఈ మందూ ఇచ్చి తరువాతగానీ మంచి మందు ఇవ్వరు."

"ఛా. ఇంగ్లీషు డాక్టర్లు అట్లాచెయ్యరు. ఏదో కర్మంచాలకపోతే రోగం నాలుగురోజులు వేధిస్తుంది అంతేగాని——"

"డాక్టరుగారింకా బయటికి రాలేదూ?ఇవాళ పొద్దుటినుంచి ఇక్కడికి రావటం ఇది మూడో మాటు. ఈ డాక్టర్లు ఓకయోగాన చిక్కరండీ!" అంటూ విసుకున్నాడా బుర్రమీసాల మనిషి. అతనితోపాటు ఆవారా బుష్‌కోటు వేసుకుని ఒక యువకుడు కూడా వచ్చాడు.

ఎవ్వరూ అడగకుండానే ఆయన మళ్ళీ ప్రారంభించాడు. "మొన్న మధ్యాహ్నం మా బాబుకు ఆస్మా అటాక్‌వస్తే, దగ్గరున్న డాక్టరు కదా అని రాంజీదగ్గరికివెళితే విజిటింగ్ ఫీజ్ ముదుపు చెల్లించేదాకా కదిలిరాలేదు. అంతదాకా పనివాడిద్వారా రాయబారాలు, ఆయన అన్నం తింటున్నాడనీ, నిద్రపోతున్నాడనీ, ఇప్పుడు రాలేడనీ...ఏవేవో."

"అవునుమరి. ఆయన మనిషే. ఆయనకూ కాసేపు విశ్రాంతి అంటూ ఉండొద్దూ?" అని ఆవారా బుష్‌కోటు అందుకుంది.

"ఇవతల మనిషి చచ్చేనా, బతికేనా అని ఉంటే, నీ విశ్రాంతి ఏమిటయ్యా?" తలపాగా ఆసామీ అన్నాడు.

"విజిటింగ్ ఫీజ్ అందగానే, విశ్రాంతిమాట కాస్తా ఎటుపోయిందో?" అని బుర్రమీసా లాయన వేళాకోళంగా అన్నాడు.

"డబ్బు గుంజుకునే విధాలన్నీ ఇవే!" అని ఒక నగ్నసత్యాన్ని వెలిబుచ్చినట్లు విర్రవీగాడు తలపాగా ఆసామీ.

"అయితే. డబ్బు తీసుకోకుండా నీవు ధర్మంగా మందు లివ్వాలి? అలా కావలిస్తే ధర్మాసుపత్రికి పోవాలి. అంతేగానీ, ఇంతచదువు చదివీ, ఉత్తపుణ్యానికి మందులిమ్మంటే ఎవరిస్తారయ్యా?"

"ఉత్తపుణ్యానికి మందులవ్వమని ఎవ్వరూ అనరు. అయితే కాస్త వెనకాముందూ మంచీ చెడ్డా చూసి మసలాలి. తారతమ్యం అనేది ఒకటుంది. అందరి బాధా ఒకటే అనేది గ్రహిస్తే చాలు." నేనూ కలుగజేసుకోకుండా ఉండలేక పోయాను

ఆ బుర్రమీసాల ఆసామీ గాంధీ ఫోటో వైపు చూసి, వెనక్కిమళ్ళీ వెస్టుకోటుజేబీలో చెయ్యిపెట్టుకుని, సరే పదరాఅబ్బాయ్. మూడు మాట్లు తిరిగిన వాళ్లకు, నాలుగోమాటు రావడం కష్టమా?" అని బయటికి నడిచాడు.

సీత తలనొప్పి అని లేచి కూచుంది. రాముం స్థితిలో ఏమీ మార్పు కనబడలేదు. బయట కారు శబ్దం అయింది.

డాక్టరు నేరుగా కంపౌండరు గదిలోకి వెళ్లి ఏవో చెప్పి నాదగ్గరకు వచ్చాడు. రాముం చెయ్యి చూసి, నాడి పరీక్షించాడు. స్తెతస్కోపుతో రొమ్ము చూశాడు. టంగ్ డిప్రెసర్‌తో నాలిక దించి గొంతుకు చూసాడు. ముక్కులో లైటు వేసి పరిశీలించాడు. పొట్టను చేతితో నొక్కి చూసినప్పుడుమాత్రం రాముం కదిలి మూలిగాడు. కంపోడరు వచ్చి, థర్మామీటరు చంకలో పెట్టి చూపి, "నూట ఒకటి" అన్నాడు.

"ఏమండీ అబ్బాయికి సీరియస్‌గా ఉంది. జైహింద్ లేబరేటరీలో రక్తమూ, గొంతూ పరీక్ష చేయించుకురావాలి. రిపోర్టు వచ్చేలోగా, వెంటనే ఈ సీరం ఇంజక్షన్ ఇవ్వాలి" అని చీటీ రాసి ఇచ్చాడు.

"అమ్మాయి మాట ఏమిటంటారు?"

"అమ్మాయిజాడ్యం నాకు అంతుమట్టకుండా ఉన్నది. నెలరోజులనుంచీ జ్వరం, దగ్గూ, చెవినొప్పీ టాన్సిల్సు ఎల్లార్జి అయినాయండీ వీలు చూసుకుని అవి తీయించేయ్యాలి. జైహింద్ లాబ్‌లో రక్తం బి.యస్.ఆర్. కు పరీక్ష చేయించుకురండి. అమ్మాయికి ఎక్సరేతీయించాలి. కఫం కూడా పరీక్ష చెయ్యాలి. చెవినొప్పికి డాక్టర్ శ్రీమాన్ ఇ. యన్. టి. స్పెషలిస్టు దగ్గరికి తీసి కెళ్తే మంచిది."

"పోనీ సీత విషయం నింపాదిగా చూద్దాం లెండి. ప్రస్తుతం అముందే ఇవ్వమంటారా?"

"సరే. అదే ఇవ్వండి. అబ్బాయికి సీరం మాత్రం వెంటనే తీసుకురండి."

"సరే" అని వెళ్ళాను.

రక్తం పరీక్షకు డబ్బూ, ఎక్సరేకు డబ్బూ, ఇంజక్షనుకు డబ్బూ డాక్టరుకు డబ్బూ, స్పెషలిస్టుకు డబ్బూ.

డబ్బు ఎక్కడినుంచి తీసుకురాను? డబ్బులేని బీద గృహస్థుడికి బిడ్డల నెందుకివ్వాలి? ఇచ్చినా జబ్బులెందుకు చెయ్యాలి? డాక్టర్లు మనిషి తాహతును చూసి మాట్లాడలేరు.

వాళ్ళకు తెలిసింది బహుకొద్ది. వారి అజ్ఞానాన్ని కప్పిపుచ్చుకోటానికి ఇరవైతొమ్మిది పరీక్షలు చేయిస్తారు.

నాకేమీ పాలుపోలేదు. అవసరానికి అప్పు పుట్టదు. మా ఆవిడ కంచాన్ని సావుకారుఅంగట్లో కొదవపెట్టి ఈ పరీక్షలకు సమర్పించాను.

రామానికి సాయంత్రానికి శ్వాసపీల్చటం కష్టం అనిపించింది. మళ్ళీ డాక్టరుదగ్గరికి తీసికెళ్ళాం. ఆయన గొంతూ, గుండెలూ పరీక్షించి "వెంటనే జనరల్ హాస్పిటల్‌కు తీసికెళ్ళాలి. గొంతు ఆపరేషన్‌చేస్తేనే అబ్బాయి ప్రాణం దక్కుతుంది. తక్షణం టాక్సీలో తీసుకువెళ్ళండి" అని అన్నాడు. తనకు ఏమికాబట్టని వేదాంతిలా మళ్ళీ కుర్చీలోకూచున్నాడు.

నా గుండె దడదడా కొట్టుకున్నది. ఆయన పొద్దున్న చేసిన తాత్సారానికి నాకు ఎంతోకోపం వచ్చింది. ఆ కోపావేశంలో నాలుగూ జాడించి అడుగుదామనుకున్నాను. కాని, దానివల్ల ప్రయోజనంలేదని అనుకుని, మింగలేక కక్కలేక టాక్సీ కోసం బయటికి నడిచాను.